ప్రజాశక్తి
ఆదివారం 30 జూన్ 2024 5 అనంతపురం

# పించన్ల పంపిణీకి సన్నద్ధం

## కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధంగా ఉన్నామని కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్ తెలియజేశారు. వెలగపూడి ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి శనివారం నాడు పింఛన్ల పంపిణీ, తదితర అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. అనంతపురం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ కలెక్టర్‌తో పాటు జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, డీఆర్డీఏ పీడీ ఈశ్వరయ్య, డీపీవో ప్రభాకర్ రావు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద జూలై ఒకటో తేదీన పెన్షన్ల పంపిణీకి అన్ని విధాలా సన్నద్ధం కావాలని ఆదేశించారు. ఒకటో తేదీనే 100 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి కావాలన్నారు. ఇందుకోసం అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జూలై 1వ తేదీన ఉదయం 6 గంటల నుంచి ఖచ్చితంగా పింఛన్ల పంపిణీ మొదలు కావాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు పంపిణీ సక్రమంగా జరుగుతుందా లేదా అన్ని విషయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలన చేయాలన్నారు. లబ్ధిదారులకు అందించేందుకు అవసరమైన నగదు పూర్తిగా బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకుని పాయింట్ పర్సన్‌లకు అప్పగించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్డీఏ అడ్మిన్ అసిస్టెంట్ అజంతుల్లా పాల్గొన్నారు.

# వానలొచ్చినా.. ముందుకు సాగని సాగు..!

◆ గతేడాది కంటే తక్కువే విత్తనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో మంచి వర్షాలు పడ్డాయి. 63 మండలాల్లోను పదునైంది. అయినా పంటల సాగు ఆశించినంత ముందుకు సాగలేదు. సాగుకు ఇంకా సమయముందని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభం ఆశాజనంగా సాగింది. సాధారణం కంటే గణనీయంగా వర్షపాతం అంతటా పడింది. జూన్ మొదటి రెండు వారాల్లోనే ఇది నమోదయినప్పటికీ ఆ తరువాత మూడవ వారం నుంచి పూర్తిగా వానలు పడకుండా కారుమబ్బులు కమ్ముకుని రావడం వర్షం చినుకు నేల రాలకపోవడం జరుగుతోంది. తిరిగి ఎప్పటిలాగానే రైతు ఆకాశం వైపు పదును కోసం ఎదురు చూడాల్సిన వస్తోంది.

**గతేడాది కంటే తక్కువే సాగు**

వర్షాలు బాగాపడ్డాయని భావిస్తున్న తరుణంలోనూ సాగు గతేడాది కంటే తక్కువగానే ఉండటం గమనార్హం. గతేడాది ఇదే సమయానికి అనంతపురం జిల్లాలో 3,22,271 ఎకరాల్లో పంటలు సాగయితే ఈసారి 25,896 ఎకరాల్లోనే విత్తనం పడింది. ఇక సత్యసాయి జిల్లాలో 47,393 ఎకరాల్లో విత్తనం పడితే ఇప్పుడు 38,587 ఎకరాల్లోనే విత్తనం వేశారు. అదే ప్రధాన పంట వేరుశనగ సాగు అదే విధంగా ఉంది. మొత్తం ఈ ఏడాది 4.88 లక్షల ఎకరాల్లో వేరుశనగ సాగవుతుందని అంచనా వేస్తే ఇప్పటి వరకు సాగైంది. 11,299 ఎకరాల్లోనే. అదే గతేడాది ఇదే సమయానికి 14,408 ఎకరాలు. సత్యసాయి జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వేరుశనగ 4.32 లక్షల ఎకరాల్లో సాగవుతుందన్నది వ్యవసాయాధికారుల అంచనా. ఇప్పటి వరకైంది 26,158 ఎకరాలు. గతేడాది ఇదే సమయానికి అయిన సాగు 38,948 ఎకరాలు. ఇతర పంటల సాగుకు నామమాత్రంగానే ఉంది.

**పడిన వర్షం అధికం**

అనంతపురం జిల్లాలో సాధారణ వర్షపాతం జూన్ నెలాఖరు వరకు 60.7 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 147.6 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 143.2 మిల్లీమీటర్లు పడింది. సత్యసాయి జల్లాలో 65.7 మిల్లీమీటర్లకుగానూ 148.5 మిల్లీమీటర్లు నమోదయింది. సాధారణం కంటే 126 శాతం అధికంగా పడింది. ఈ వర్షపాతంలో అత్యధికంగా నెల మొదటి రెండు వారాల్లోనే నమోదయింది. ఆ తరువాత మూడవ వారం నుంచి చినుకు జాడలేదు. విత్తనం విత్తుకోవడానికి ఇదే సరైన సమయం. చినుకుజాడలేకపోవడంతో నేలలో తేమ లేక రైతులు సరైన సమయంలో విత్తనం విత్తుకునేందుకు ఆకాశం వైపు ఎదురు చూసే పరిస్థితులు నెలకొని ఉన్నాయి. ఈ సమయంలో ఒక్క పదును అయితే సాగు విస్తీర్ణం ఆశించినంత జరిగేందుకు అవకాశం ఉంటుంది.

# ఎస్‌జిటిలకు న్యాయం జరగాలి

## డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బాలకృష్ణ

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయబోయే నోటిఫికేషన్‌లో ఎస్‌జిటిలకు న్యాయం జరిగేలా పూరి స్థాయి ఉపాధ్యాయ పోస్టులతో భర్తీ చేయాలని డివైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు యక్కలూరి బాలకష్ణ శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. త్వరలో విడుదల కాబోతున్న డీఎస్సీ నోటిఫికేషన్‌లో ఎస్‌జిటి పోస్టుల భర్తీలో అనంతపురం జిల్లాకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. దీనిపై ప్రభుత్వం పున:సమీక్ష చేసి మొత్తం ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ప్రకటించిన ఎస్‌జిటి పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. వాటి సంఖ్యను పెంచి పేదల ప్రాథమిక విద్యను కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని తెలిపారు. నిరుద్యోగుల ఆశలు నెరవేరేలా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ఉండాలన్నారు. గత 7 ఏళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ లేనందున వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలన్నారు. గతంలో రద్దు చేసిన వ్యాయామ, పిఇటి పోస్టులను పునరుద్దరించాలని కోరారు. ఈ సంవత్సరం చివరి నాటికి ఉద్యోగ విరమణ చేస్తున్న ఉపాధ్యాయుల లెక్కలు, రాష్ట్రంలో ఏకోపాధ్యాయుడు ఉన్న పాఠశాలలను దృష్టిలో ఉంచుకుని పోస్టులను భర్తీ చేయాలన్నారు. రిటైర్‌మెంట్ వయసును 62 నుంచి 58కి తగ్గించి యువత శక్తి సామర్థ్యాన్ని ప్రభుత్వం ఉపయోగించుకోవాలన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగులకు ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ, స్టడి మెటీరియల్ ఇవ్వాలని కోరారు.

# గేట్స్ కళాశాలలో డ్రోన్ తయారీ యూనిట్

ఒప్పంద పత్రాలు చూపుతున్న కళాశాల యాజమాన్యం

**గుత్తి :** పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో డ్రోన్ తయారి యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు ఆ కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ జి.రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంవోయుతో ఒప్పందం కుదిరింది. ఎండి జి.రఘునాథరెడ్డి మాట్లాడుతూ చెన్నైకి చెందిన ప్రముఖ డ్రోన్ తయారీ సంస్థ గరుడా ఏరో స్పేస్ ఏర్పాటు చేసే డ్రోన్ తయారీ కేంద్రానికి కావాల్సిన స్థలం, సదుపాయాలు కల్పిస్తామన్నారు. గేట్స్ ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ విద్యార్థులకు గరుడా ఏరో స్పేస్ సంస్థ ద్వారా డ్రోన్ల తయారీపై శిక్షణ, ఇంటర్నషిప్ ఇస్తారన్నారు.కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ వికె.శ్రీవాణి, ప్రిన్సిపల్ డాక్టర్ సురయ, ప్లేస్మెంట్ అధికారి తన్వీర్, ఏవో ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ చంద్రకళ

# క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - అనంతపురం అర్బన్

క్యాన్సర్ వ్యాధిపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారులు సూచించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో శనివారం నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ భ్రమరాంబదేవి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా మెడికల్ కళాశాలలోని ఎస్‌పిఎంలు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గైనికో డాక్టర్ చంద్రకళ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గర్భకోశ ముఖద్వార, రొమ్ము, నోటి క్యాన్సర్లపై స్పెషలిస్ట్ డాక్టర్లు అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమం తర్వాత గ్రామాల్లో 30 సంవత్సరాలు పైబడిన మహిళలను పరీక్షించాలన్నారు. అనుమానాస్పద మహిళలను గుర్తించి స్పెషలిస్ట్ డాక్టర్ల వద్దకు చికిత్స నిమిత్తం పంపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్ కుమార్, పీహెచ్సీల వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పింఛను పెంపు ఘనత టిడిపిదే : ఎమ్మెల్యే

**అనంతపురం కలెక్టరేట్ :** 35 రూపాయల పింఛన్‌ను 4వేల రూపాయల వరకు తీసుకెళ్లిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారి పింఛన్లు పెంచడమే కాకుండా, వద్ధులు వికలాంగులకు ఇచ్చే మొత్తాన్ని కూడా పెంచిందని గుర్తు చేశారు. ఎన్టీఆర్ హయాంలో నెలకు రూ.35చొప్పున పింఛన్ అందించడం ప్రారంభించారని ఇప్పుడు అది 4వేల రూపాయలకు చేరిందంటే ఆ ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. గతంలో జగన్ 3వేల రూపాయల పింఛన్ ఇస్తామని చెప్పి ప్రతి ఏడాది 250రూపాయలు మాత్రమే పెంచారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు చెప్పినట్టుగానే ఏప్రిల్ నుంచే ఈ పెంపును వర్తింప జేస్తూ జులై నెలలో ప్రతి పింఛన్ దారునికి 7వేల రూపాయలు ఇస్తున్నట్టు తెలిపారు.

# సూర్యప్రకాష్ రెడ్డి సేవలు మరువలేనివి

**అనంతపురం :** వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో కుష్ఠ వ్యాధి విభాగంలో పనిచేస్తున్న సూర్యప్రకాష్ రెడ్డి ఉద్యోగ విరమణ సభను శనివారం సాయంత్రం నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సమావేశ భవనంలో నందు డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ ఈబి.దేవి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పలువురు సూర్యప్రకాష్‌రెడ్డి సేవలను కొనియాడారు. 40 సంవత్సరాలుగ ఎంతో అంకిత భావంతో పనిచేసి వైద్య శాఖకు మంచి పేరు తీసుకొచ్చారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కుష్ఠ , టిబి, హెచ్‌ఐవి ఎయిడ్స్ విభాగం అధికారి డా॥అనుపమ జేమ్స్, రిటైర్డ్ డిఎంహెచ్‌ఒ డా॥రామసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఫర్టిలైజర్స్ తయారీ యూనిట్ తనిఖీ

**అనంతపురం :** అనంతపురం పంగల్ రోడ్డు వద్దగల ఎంవి బయలాజికల్ బయోఫర్టిలైజర్స్ అండ్ బయో పెస్టిసైడ్స్ మ్యానుఫ్యాక్చరింగ్ యూనిట్‌ను జిల్లా వ్యవసాయ అధికారిని యు.ఉమామహేశ్వరమ్మ తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్స్, ల్యాబ్‌ను అనంతపురం వ్యవసాయ అధికారి జె.శశికళ, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయం సాంకేతిక వ్యవసాయ అధికా బాలా నాయక్‌తో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు బి.మురళీకష్ణ, పి.అలేఖ్య పాల్గొన్నారు.

తనిఖీ చేస్తున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

# ఎమ్మెల్యే శ్రావణశ్రీ సుడిగాలి పర్యటన

◆ ప్రజాశక్తి కథనంతో వైద్యశాల తనిఖీ
◆ కెజిబివి, బస్టాండ్‌లో పరిస్థితులపై ఆరా

డ్రెయినేజీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

ప్రజాశక్తి-నార్పల

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం నార్పలలో సుడిగాలి పర్యటన చేశారు. ప్రాథమిక వైద్యశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయను తనిఖీ చేయడంతో పాటు బస్టాండ్ ఆవరణలో నిలిచిపోయిన డ్రెయినేజీని పరిశీలించారు. ప్రయాణికులతో మాట్లాడి ఇబ్బందులు తెలుసుకున్నారు. ప్రాథమిక వైద్యశాలలో ఐయువి కిట్ల కొరతపై ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం కథనం ప్రచురితం కావడంతో స్పందించిన ఎమ్మెల్యే ఆసుపత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్యసేవలు, సమస్యలపై ఆరా తీశారు. ఐయువి కిట్లు తెప్పిస్తామని, త్వరలో గైనకాలజిస్ట్ డాక్టర్‌ను నియమించేలా చర్యలు తీసుకుంటామని, అర్థాంతరంగా ఆగిన నిర్మాణాలపై విచారణ చేస్తామని తెలిపారు. ఆసుపత్రి లో సమస్యలపై ఓ వినతి ఇవ్వాలని వైద్యుడు ప్రవీణ్‌కుమార్, సిహెచ్‌ఒ బాలాజీలకు సూచించారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కెజిబివి)ను సందర్శించి బోధన, భోజనం, తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. జూనియర్ కళాశాల భవనాలను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పెండింగ్ పనులను పూర్తి చేయించి త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. బస్టాండ్ ఆవరణలో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవని, కూతలేరు వంతెన నిర్మాణ సమయంలో తొలగించిన గాంధీ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని సిపిఐ నేత గంగాధర్, తదితరులు ఎమ్మెల్యేకి విన్నవించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు బస్టాండ్‌లో డ్రెయినేజీ వ్యవస్థను పరిశీలించి వెంటనే శుభ్రం చేయించాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట ఎంపీడీవో రాముడు, ఈఓఆర్డీ శైలజారాణి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, ఎంఈఓ కృష్ణయ్య, మేజర్ పంచాయతీ కార్యదర్శి అశ్వర్థనాయుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆలం నరసానాయుడు, నాయకులు ఆకుల విజయ్‌కుమార్, ఆలం నాగార్జుననాయుడు, ప్రతాప్ చౌదరి, పిట్టు రంగారెడ్డి, చంద్రబాబు, తిప్పన్న, సాలెహ, గుమ్మడం రాధాకృష్ణ, ఇస్మాయిల్, నాగభూషణం, రాజేంద్ర, వెంకటంపల్లి సాయినాథ్, జనసేన నాయకులు గంజిగుంట రామకృష్ణ, తుపాకుల భాస్కర్ ఉన్నారు.

మాట్లాడుతున్న తిరుపతి నాయుడు

# ఆయుష్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం

**అనంతపురం :** ఆయుష్ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించినట్లు సీనియర్ మెడికల్ ఆఫీసర్ నల్లపాటి తిరుపతి నాయుడు తెలిపారు. స్థానిక కోర్టు రోడ్ లోని శ్రీ సత్య సాయి బాలికల జూనియర్ కళాశాలలో శనివారం ఈకార్యక్రమం చేపట్టారు. డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, ఫైలేరియా, అతిసారా, వాంతులు తదితర జబ్బులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి నిరోధక శక్తిని పెంచే హోమియో మందులను 700 మంది విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సరళాదేవి ఆయుష్ ఫార్మసిస్ట్ సుదర్శన్ రెడ్డి, సిబ్బంది శాంతమ్మ, మానవ హక్కుల సంఘం సౌత్ ఇండియా సెక్రటరీ ఆవుల ప్రసాద్ పాల్గొన్నారు.

# నెట్టికంటి సేవలో ఎస్పీ

**గుంతకల్లు రూరల్ :** జిల్లాలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసాపురంలో వెలసిన నెట్టికంటి ఆంజనేయస్వామిని శనివారం జిల్లా ఎస్పీ గౌతమిశాలి దర్శించుకున్నారు. ముందుగా ఆమెకు అర్చకులు, వేదపండితులు ఎదురెళ్లి పూర్ణకలశంతో స్వాగతం పలికారు. ఎస్పీ స్వామివారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు. అలాగే స్వామివారి శేష వస్త్రం, పూలమాల, ప్రసాదం అందజేశారు.

# ఎంబీఏ విద్యార్థులకు సెమినార్

**అనంతపురం :** అనంతపురం జేఎన్టీయూ మేనేజ్మెంట్ విద్యార్థులకు బిజినెస్ రీసెర్చ్ మెతడాలజీపై ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం సెమినార్ హాల్‌లో సెమినార్‌ను శనివారం నిర్వహించారు. ఎంబీఏ విభాగ అధిపతి డాక్టర్ టి.నారాయణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో అశోక ఉమెన్స్ కాలేజ్ ఆచార్యులు శేషాద్రి కిరణ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మేనేజ్మెంట్ విద్యార్థులకు త్వరలో పరీక్షలు, ప్రాజెక్టు వర్క్ జరుగుతున్న నేపథ్యంలో బిజినెస్ రీసర్చ్ మెతడాలజీపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రములో ఎంబీఏ అధ్యాపకులు లక్ష్మణ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# కదిరి ప్రభుత్వాసుపత్రిలో మహిళ మృతి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

చికిత్స నిమిత్తం కదిరి ప్రభుత్వాసుపత్రికి వచ్చిన ఓ మహిళ మరణించింది. డ్యూటీ డాక్టర్లు సకాలంలో వైద్య చికిత్సలు అందించకపోవడం వల్లనే ఆమె మరణించిందంటూ బంధువులు శనివారం ఉదయం ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మృతురాలి కుమారుడు వెంకటేశ్వర్లు విలేకరులతో మాట్లాడుతూ కదిరి పట్టణం వాణిస్ట్రీట్‌కు చెందిన తులసమ్మ(50) శరీరంపై బొబ్బలు రావడంతో చికిత్స నిమిత్తం ఈ నెల 18వ తేదీ మంగళవారం నాడు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లామన్నారు. వైద్యులు ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చుకున్నారన్నారు. ఆసుపత్రిలో చేర్చుకున్నప్పటి నుంచి డ్యూటీలో ఉన్న నర్సులు, డాక్టర్లు ఎలాంటి చికిత్సలూ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రంతా వాంతులు అవుతున్నాయని పదేపదే సిబ్బందికి తెలియజేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారన్నారు. ఊపిరి ఆడక ఇబ్బంది పడుతున్నా కనీసం ఆక్సిజన్ కూడా పెట్టలేదన్నారు. ఇలా ఇబ్బంది పడుతూనే 19వ తేదీ బుధవారం మా అమ్మ మరణించిందన్నారు. డ్యూటీ డాక్టర్ల నిర్లక్ష్యం వల్ల మరణించిందని వైద్యులను ప్రశ్నిస్తే తమనే బెదిరించారన్నారు. మృతదేహాన్ని తీసుకెళ్లకుంటే మార్చురీకి తరలిస్తామని చెప్పడంతో చేసేది లేక అక్కడి నుంచి వచ్చేశామన్నారు. సకాలంలో స్పందించి వైద్య పరీక్షలు చేసి, చికిత్సలు అందించి ఉంటే మా అమ్మ బతికేదని వెంకటేశ్వర్లు కన్నీటి పర్యవంతం అయ్యారు.

**విచారణ జరిపిస్తాం : హుస్సేన్, సూపరింటెండెంట్.**

తులసమ్మ మృతిపై ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తామని కదిరి ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. వైద్యులు, సిబ్బంది తప్పిదం ఉంటే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని విధాలా దీనిపై సమగ్ర విచారణ చేస్తామని తెలియజేశారు.

# తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

## కౌన్సిల్ మీట్‌లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయరాం

ప్రజాశక్తి-గుత్తి

మున్సిపాలిటీ పరిధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హామీ ఇచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని సభా మందిరంలో శనివారం ఛైర్‌పర్సన్ డి.వన్నూరుబీ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ హాజరు కాగా ఛైర్‌పర్సన్‌తో పాటు వైస్ ఛైర్‌పర్సన్లు బి.పద్మలత, బి.వరలక్ష్మి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు, వివిధ విభాగాల అధికారులు ఎమ్మెల్యేకు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేశారు. పురపాలక సంఘంలో నెలకొన్న పలు సమస్యలను సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీరు సక్రమంగా సరఫరా చేసేలా చర్యలు చేపడతామన్నారు. గుత్తి చెరువును హంద్రీనీవా పథకం ద్వారా కృష్ణా జలాలతో నింపుతామన్నారు. చెరువు నిండితే భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. నియోజకవర్గంలోని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి పలు వార్డులను పరిశీలించారు.

# ప్రజల సహకారంతోనే బళ్లారి రోడ్డు విస్తరణ : ఎమ్మెల్యే

కుర్ని కులస్తుల సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణ ప్రజల సహకారంతో స్థానిక బళ్లారి రోడ్డు విస్తరణ చేపడతామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. కుర్ని సామాజిక వర్గం ఆధ్వర్యంలో శనివారం సమాజ సత్రంలో ఏర్పాటుచేసిన అభినందన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు మెయిన్ బజార్‌లో ప్రజలు చేసిన త్యాగం, సహకారం వల్లనే రోడ్డు విస్తరణ జరిగిందన్నారు. బళ్లారి రోడ్డును విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అయితే ప్రజలు సహకరిస్తే తప్ప రోడ్డు విస్తరణ చేపట్టలేమన్నారు. గతంలో తాను చేసిన కృషి వల్లనే రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, జాతీయ రహదారిపై రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరైందన్నారు. పట్టణంలో భారీ రవాణా వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు 74-ఉడేగోళం జాతీయ రహదారి వద్ద నుంచి మల్లాపురం రైల్వే గేట్ వరకూ ఆఫ్ రింగ్ రోడ్ త్వరలో చేపట్టనున్నట్లు తెలిపారు. రాయదుర్గాన్ని నగరం తరహాలో తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కుర్ని సామాజిక వర్గం ప్రతినిధులు టంకశాల హనుమంతు, దబ్బడి యోగానంద, పత్రాల నాగరాజు, మాదిగొండే బసవరాజు, తట్టే చంద్రశేఖర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ ముదిగల్లు జ్యోతి, కౌన్సిలర్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

# డ్రెయినేజీల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా : మేయర్

మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

నగరంలోని తాడిపత్రి బస్టాండ్ వద్ద మున్సిపల్ కాంప్లెక్స్ దుకాణాల ముందు ఉన్న ప్రధాన కాలువలో పూడికతీత పనులను శనివారం మేయర్ మహమ్మద్ వసీం డిప్యూటీ మేయర్లు వాసంతి, కోగటం విజయ భాస్కర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. మేయర్ మాట్లాడుతూ దుకాణాల్లోని వ్యర్థాలను ప్రధాన కాలువలో వేయడం వల్ల అవి పేరుకుపోయి మురుగు ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నా యని, ఇకపై వ్యాపారులు కాలువల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా విధించాలని, కాలువలపై ఆక్రమణలు తొలగిం చాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్న తరుణంలో మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని శానిటరీ సెక్రటరీ లు, ఇన్‌స్పెక్టర్, మేస్త్రీలకు ఆదేశాలు జారీ చేశారు. డ్రెయినేజీల శుభ్రతతో పాటు పారిశుధ్యంపై ప్రత్యేక దష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. వారి వెంట కార్పొరేటర్లు లక్ష్మీదేవి, కమల్ భూషణ్, బాబాఫక్రుద్దీన్, ఎంహెచ్‌ఒ.విష్ణుమూర్తి, ఎసిపి.హరిప్రసాద్, డిఈ శేఖర్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



# హెచ్‌ఎం చంద్రశేఖర్‌గౌడ్ సేవలు మరువలేనివి

**ప్రజాశక్తి-శింగనమల**

మండలంలోని సోదనపల్లి జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌గౌడ్ సేవలు మరువలేనివని అధికారి నరసింహరాజు కొనియాడారు. చంద్రశేఖర్‌గౌడ్ ఉద్యోగ విరమణ సందర్భంగా శనివారం పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. నరసింహరాజు మాట్లాడుతూ చంద్రశేఖర్ గౌడ్ తోటి ఉపాధ్యాయులు, విద్యార్థులతో సఖ్యతగా ఉంటూ విశేష సేవలు అందించారన్నారు. విశ్రాంత జీవితం సుఖ సంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎంఇఒ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తూ రిటైర్ అయిన శివశంకర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు వివేకానంద, మధుసూదన్‌రెడ్డి, సురేష్, బయపురెడ్డి, ఎస్‌టిఓ నారాయణరెడ్డి, పరిమళ, రుక్మిణమ్మ, హేమలత, రజనీ, పూర్వ విద్యార్థులు రామాంజనేయులు, బండారు కుళ్లాయప్ప, కిష్ట, రమేష్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌గౌడ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

## పలువురికి ఉద్యోగ విరమణ సన్మానం

**బెళుగుప్ప :** మండలంలోని తగుపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు వెంకటప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన ఉద్యోగ విరమణ పొందిన బి.ఈశ్వరప్ప, లలితమ్మ దంపతులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వారిని తోటి ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. పలువురు మాట్లాడుతూ బి.ఈశ్వరప్ప ఉపాధ్యాయుడిగానే కాకుండా చిత్ర కళాకారుడిగా మన్ననలు పొందారని, నాటక రంగంలో దుర్యోధనుడు, మాయల మరాఠీ, తదితర పాత్రలు పోషించి మెప్పించాడన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాధాకృష్ణ, వెంకట నాయుడు, టిడిపి జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మాజీ ఎంపిటిసి కంచరాముడు, బాలకృష్ణ, జయరాములు, ప్రధానోపాధ్యాయులు బెలుగుప్ప వెంకటప్రసాద్, వెంకటాద్రి పల్లి బాలాజీ, మురళీనాథ్, ఉపాధ్యాయులు శంకరయ్య, సౌమ్య, పద్మాబాయి, రాధాకృష్ణ, ఎస్. నాగరాజు, విటల్, విద్యార్థులు పాల్గొన్నారు.

**వజ్రకరూరు :** విధి నిర్వహణలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని విడపనకల్లు ఎంపీపీ కరణం పుష్పావతి భీమ్‌రెడ్డి పేర్కొన్నారు. విడపనకల్లు మండలంలోని గడేకల్ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న వి.రామాంజనేయులు శనివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో పాఠశాల సిబ్బంది ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ కరణం పుష్పావతి భీమిరెడ్డి హాజరై వి.రామాంజనేయులును సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒ మల్లికార్జున, స్కూల్ కాంప్లెక్స్ ఛైర్మన్ మనోహర్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం అపర్ణ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయ బృందం, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**నార్పల :** స్థానిక ఉయ్యాలకుంట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ శనివారం ఉద్యోగ విరమణ పొందడంతో గ్రామ పెద్దలు, అధికారులు, సహచర ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ నార్పల సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు విరమణ సహజమన్నారు. ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి గ్రామంలో పలువురి మన్ననలు పొందారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంఇఒలు కృష్ణయ్య, నారపరెడ్డి, నాయకులు శివయ్య, చికెన్ గోపాల్, నాగరాజు, పాల్గొన్నారు

**రాయదుర్గం :** గుమ్మగట్ట మండలంలోని గొల్లపల్లి గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎం.ప్రభానంద, మండలంలో పని చేస్తున్న ఉపాధ్యాయులు గణేష్, ఆర్.సుమలత శనివారం ఉద్యోగ విరమణ పొందారు. వారిని తోటి ఉపాధ్యాయులు, యుటిఎఫ్ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. డి.హీరేహాల్ మండలంలోని కాదలూరు జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేసిన ఉపాధ్యాయులు ఇన్నయ్యను ఉద్యోగ విరమణ సందర్భంగా ఉపాధ్యాయులు, యుటిఎఫ్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఇక రాయదుర్గం పురపాలక సంఘంలో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న వేమనారాయణ, నారాయణమ్మ, కులుసుంబిలను మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాలు శిల్ప, పాలకమండలి సభ్యులు, అధికారులు ఘనంగా సత్కరించారు.

**నార్పల :** స్థానిక యూనియన్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పని చేస్తున్న సుదర్శన్ బదిలీపై కర్నూలు జిల్లాలోని పలకూరు శాఖకు బదిలీ అయ్యారు. దీంతో శనివారం ఆయనను నూతనంగా వచ్చిన మేనేజర్ డైమండ్ స్వరూప్, ఆలం వెంకట నరసానాయుడు, ఆలం నాగార్జున, బ్యాంక్ సిబ్బంది వేణు, సురేంద్ర, చంద్రశేఖర్, రవి, ఖాతాదారులు ఘనంగా సత్కరించారు.

## 'బడే విద్యార్థులకు బంగారు బాట'

**బ్రహ్మసముద్రం :** చదువు నేర్చుకుంటున్న, నేర్చుకోబోతున్న విద్యార్థులకు బడే బంగారు బాట అని ఐసిడిఎస్ సూపర్వైజర్ కాశీంబి పేర్కొన్నారు. ఆమె శనివారం మండలం లోని కన్నెపల్లి గ్రామంలో అంగన్వాడీ పిల్లలతో కలిపి "అంగన్వాడీ బడిబాట", "అంగన్వాడీ పిలుస్తోంది" ర్యాలీలు నిర్వహించారు. ముందుగా సరస్వతి పూజ నిర్వహించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, అంగన్వాడీ పిల్లలతో కలిసి గ్రామ వీధుల గుండా తిరిగి చదువు ప్రాముఖ్యత, అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగమణి, ఉపాధ్యాయులు ఎర్రిస్వామి, పంచాయతీ కార్యదర్శి రాముడు, జిఎంఎస్‌కె.జయ, ఎఎన్‌ఎం సంగీత, అంగన్వాడీ కార్యకర్తలు గీతమ్మ, సుజాత, ప్రమీల, శాంతకుమారి, సుజాత, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలుగుతమ్ముళ్ల వార్డుల పర్యటన

**పామిడి :** టిడిపి నాయకులు శనివారం పట్టణంలోని 20 వార్డుల్లో పర్యటించారు. స్థానికులు డ్రెయినేజీ, విద్యుత్, తాగునీరు, రోడ్డు, పెద్ద కాలువలో పూడికతీత, తదితర సమస్యలను వారి ముందు ప్రస్తావించారు. నాయకులు మాట్లాడుతూ గుమ్మనూరు ఈశ్వర్‌తో చర్చించి వీలైనంత వరకూ ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టౌన్ మాజీ కన్వీనర్ బొమ్మ మోహనకృష్ణ, వార్డ్ అధ్యక్షులు రాజు, అప్పన్నగారి కుమార్, నల్లబోతుల శ్రీనివాసులు, శ్రీరాములు, తిమ్మప్ప, ఆచారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెన్నహోబిలంలో అక్రమాలపై విచారణకు డిమాండ్

**వజ్రకరూరు :** పెన్నహోబిలంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి రథోత్సవ వేడుకల్లో జరిగిన అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ చేపట్టాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బోయ వెంకటేష్, సెక్రటరీ వన్నూరుస్వామి డిమాండ్ చేశారు. ఉరవకొండలో శనివారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రథోత్సవ వేడుకలు ప్రారంభమైనప్పటి నుంచి నెల పూజ జరిగే వరకూ వేలాది మంది భక్తులు స్వామి దర్శనానికి రాగా కనీస వసతులు కల్పించలేదన్నారు. భక్తుల విరాళాలతో పాటు ఆలయ గదులను అద్దెకివ్వడంలోనూ కార్యనిర్వహణధికారి అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో కౌలు రైతు సంఘం సభ్యులు ఓబయ్య, వెంకటప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## ఐటిఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ : ప్రిన్సిపల్

**వజ్రకరూరు :** ఉరవకొండ ప్రభుత్వ ఐటిఐలో 2024-25 విద్యా సంవత్సరానికి మొదటి విడతలో మిగిలి పోయిన సీట్ల భర్తీ కోసం జులై 24వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ నాగరాజు తెలిపారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ దరఖాస్తు చేసిన ప్రతి విద్యార్థి 25వ తేదీ లోపు ఐటిఐలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. స్థానిక గాంధీ చౌక్‌లోని ఐటిఐ భవనంలో 27వ తేదీ అడ్మిషన్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఉంటుందని తెలిపారు.

## ఎంపి అంబికాను కలిసిన నాయకులు

**పుట్లూరు :** అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మీనారాయణను శనివారం ఢిల్లీలో మండల నాయకులు పి.పుల్లారెడ్డి కలిశారు. మండలంలో తాగునీరు, రోడ్లు, తదితర సమస్యలను ఆయన ఎంపి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎంపి మండలంలో తాగునీటితో పాటు మిగతా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పుల్లారెడ్డి తెలిపారు.

## ఇళ్ల వద్దే పింఛను పంపిణీ

**పెద్దపప్పూరు :** మండల వ్యాప్తంగా జులై 1వ తేదీ సచివాలయ ఉద్యోగులు లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛను పంపిణీ చేస్తారని శనివారం సంబంధిత అధికారులు తెలిపారు. మండలంగా 5,875 మంది పింఛనుదారులు ఉన్నారని, వారందరికీ 1వ తేదీ ఉదయం 6 గంటల నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛను పంపిణీ చేస్తామని తెలిపారు.

# బస్ షెల్టర్ ఏర్పాటుపై ఎమ్మెల్యేకి వినతి

**ప్రజాశక్తి-నార్పల**

నార్పలలో అన్ని వసతులతో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం స్థానిక జనసేన పార్టీ మహిళా నాయకురాలు రాయదుర్గం తేజలక్ష్మి, విద్యార్థి విభాగం నాయకులు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు నార్పలకు వచ్చి ఇక్కడి నుంచి అనంతపురం, ధర్మవరం, తాడిపత్రి, తదితర ప్రాంతాలకు వెళ్తుంటారన్నారు. అయితే నార్పలలో కనీసం బస్ షెల్టర్ కూడా లేదన్నారు. దీంతో వృద్ధులు ,మహిళలు, విద్యార్థులు, చిన్నపిల్లల తల్లులు నానా అవస్థలకు గురవుతున్నారన్నారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే అక్కడికి చేరుకుని బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసిన బస్టాండ్‌ని కూడా ఎమ్మెల్యే పరిశీలించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో చర్చించి వీలైనంత త్వరలో బస్టాండ్ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వినతి ఇచ్చిన వారిలో నార్పల మండల కన్వీనర్ గంజికుంట రామకృష్ణ, తుపాకుల భాస్కర్, దాడితోట శివయ్య, గంగాధర్, అశోక్, పోన్నతోటరామయ్య, అశ్వర్థరెడ్డి, గిరీష్, గూగూడు బాబు, కుళ్లాయప్ప, వినోదం నారాయణస్వామి, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీకి వినతి ఇస్తున్న జనసేన మహిళలు

### ఎమ్మెల్యేకి ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

వివిధ సమస్యలపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రావణిశ్రీకివినతి పత్రం సమర్పించారు. నాయకులు మాట్లాడుతూ స్థానిక ఎస్సీ సాంఘిక సంక్షేమ హాస్టల్ కాంపౌండ్ శిథిలమైందని, కొత్తగా నిర్మించాలని, నార్పల క్రాస్‌లో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని కోరారు. మండలంలో అంబేద్కర్ భవనం నిర్మించాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రంగాపురం పుల్లప్ప, గడ్డం నాగేపల్లి జయరాం, రాజు, ప్రసాద్, గంగయ్య, నారాయణ, రమణ, లక్ష్మీనారాయణ, గోపాల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 'స్టాప్ డయేరియా' క్యాంపెయిన్‌పై శిక్షణ

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

ఉరవకొండ మండలంలోని రాకెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం 'స్టాప్ డయేరియా క్యాంపెయిన్'పై వైద్యాధికారి డాక్టర్ పావని వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. డాక్టర్ పావని మాట్లాడు తూ ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార మరణాలు సంభవించకుండా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు జులై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ స్టాప్ డయేరియా క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. కలుషిత నీరు, ఆహారంపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, చేతుల శుభ్రత పాటించాలని ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఆశా కార్యకర్త గ్రామంలో మదర్ క్లబ్‌లో తల్లులకు అతిసార ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ నాగారంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్‌ఎండి షఫీ, సూపర్వైజర్ శేఖర్, స్వర్ణలత, వైద్య సిబ్బంది భారతి, నాగసురేఖ, హిమబిందు, రూప, పద్మావతి, కోమల, చాముండేశ్వరి, అనూష, హేమలత, లలిత, సలీమ పాల్గొన్నారు.

డయేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ పావని

## 1న ఎమ్మెల్యే చేత పింఛన్లు పంపిణీ

**గుంతకల్లు రూరల్ :** సిఎం చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ఇంటింటికీ పింఛను పంపిణీ కార్యక్రమాన్ని జులై 1వ తేదీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మండలంలోని కసాపురంలో ప్రారంభి స్తారని ఎంపీడీవో శ్రీకాంత్‌చౌదరి శనివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 271 క్లస్టర్లకు గానూ 142 మంది సిబ్బందితో 3వ తేదీ లోపు పింఛను పంపిణీ చేస్తామన్నారు. గతంలో 6,235 మంది పింఛనుదారులకు రూ. 2,75,40,000 పంపిణీ జరిగేదన్నారు. సిఎం చంద్రబాబు పెంచిన రూ. 3 వేలతో కలిపితే రూ. 4,25,23,000 పంపిణీ చేయాల్సి ఉందన్నారు.

## వైసిపి నుంచి టిడిపిలో చేరిక

**పామిడి :** మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు 28 మందితో కలిసి శనివారం వైసిపిని వీడి గుంతకల్లు ఎమ్మెల్యే జయరామ్ సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే టిడిపి కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎం.పెద్ద ఆంజనేయులు, ఎం.చిన్న ఆంజనేయులు, కత్రిమల బషీర్, పొగురూరు లింగ, వైస్ ఎంపీపీ అనుంపల్లి మహేష్, మంజునాథ్, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## 'పది' ఉత్తమ విద్యార్థులకు బహుమతులు

**పుట్లూరు :** స్థానిక జడ్పీ పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు శనివారం ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం విజయలక్ష్మి అధర్యంలో విద్యార్థులకు సన్మాన సభ నిర్వహించారు. పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు సత్యప్రసాద్ విద్యార్థులు కల్యాణి, గౌతమి, ప్రణతిలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పింఛను పంపిణీకి సర్వం సిద్ధం

### ఎంపీడీవో రఘునాథ్

**బొమ్మనహాల్ :** మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో లబ్ధిదారులకు జులై 1వ తేదీ పింఛను సొమ్మును ఇంటి వద్దే పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపిడిఒ రఘునాథ్ తెలిపారు. మండలంలో మొత్తం 6,598 మంది పింఛనుదారులు ఉన్నారని వారికి రూ. 4,58,61,500 మంజూరైందని, వారికి సచివాలయ ఉద్యోగులు ఇంటి వద్దకు వెళ్లి పింఛను పంపిణీ చేస్తారని తెలిపారు. వారితో పాటు ఈఒఆర్‌డి వి.దేవదాస్, సీనియర్ సహాయకులు వెంకటేశులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టిడిపి శ్రేణులతో గుమ్మనూరు ఈశ్వర్ సమావేశం

**పామిడి :** స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం గుమ్మనూరు ఈశ్వర్ టిడిపి శ్రేణులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో మండలంలోని దేవరపల్లి, రామగిరి, ఎగువతండా, దిగువ తండా, గజరాంపల్లి, పొగరూరు, రామరాజు పల్లి, జి.కొట్టాల, కాలాపురం పంచాయతీలకు సంబంధించిన టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొనగా స్టోర్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టులు ఎవరికి ఇవ్వాలనే అంశాలపై చర్చించారు. అయితే వాటిని ఎవరెవరికి ఇస్తారనే విషయంలో సందిగ్ధం నెలకొంది. దీంతో నాయ కుల మధ్య వాదోపవాదాలు జరిగాయి. గుమ్మనూరు ఈశ్వర్ మాట్లాడుతూ ఎవరైతే టిడిపి కోసం కష్టపడ్డారో వారిని గుర్తించి కచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. సమావేశంలో జింకల సంజీవ, ముసిలిరెడ్డి, ఆర్ఆర్.రమేష్, జనసేన ధను, సోషల్ మీడియా శివ, పురుషోత్తం, టిడిపి, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలి

**గుత్తి :** ఎన్నికల సమయంలో పనిచేసిన వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం తహశీల్దార్ బి.భారతికి ఏపీ వీఆర్‌ఏల సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. సంఘం మండల నాయకులు ఏసి.ఆంజనేయులు, నారాయణస్వామి, రామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పగలు, రాత్రి తేడా లేకుండా సొంత ఖర్చులతో నిరంతరం పనిచేశామన్నారు. కావున అందరితో పాటు వీఆర్‌ఏకు ఒక నెల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏపి వీఆర్‌ఏల సంఘం నాయకులు ఎస్. జగదీష్, యుగంధర్, రమణ, తదితరులు పాల్గొన్నారు.

## డయేరియా బాధితుల కోసం కంట్రోల్ రూం

**అనంతపురం :** డయేరియా బాధితుల కోసం నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఈబీ.దేవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కంట్రోల్ రూములో టోల్ ఫ్రీ నెంబర్ 08554 277434 ఏర్పాటు చేశారు. గ్రామాల్లో వాంతులు, విరేచనాలతో బాధపడే వివరాలను ఈ నెంబర్‌కు ఫోన్ చేసి తెలుపవచ్చున్నారు. ఆరోగ్య కార్యాలయ సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారని, సమాచారం అందిన వెంటనే సంబంధిత వైద్య సిబ్బందికి సమాచారం పంపి తగిన వైద్యసేవలు అందుబాటులోకి తెస్తారని తెలిపారు.

## ఆకుల బాబు దృష్టికి ప్రజల సమస్యలు

**నార్పల :** స్థానిక గారబావి కొట్టాలలో శనివారం టిడిపి నాయకులు ఆకుల బాబు పర్యటించారు. ట్యాంకులకు నీరు సరఫరా కావడం లేదని, పురాతన గారబావిలో పూడిక తీయించి, లైట్స్ ఏర్పాటు చేయాలనీ కోరారు. స్పందించిన ఆయన ఆయా సమస్యలను పరిష్కరించడంతో పాటు సొంత డబ్బుతో లైట్స్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే డ్రెయినేజీ, వీధి దీపాల సమస్యలను కాలనీ వాసులు ఏకరువు పెట్టారు. గత ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం ప్రజల సమస్యలను విస్మరించిందని, ఇక నుంచి ప్రజలకు ఏ సమస్య వచ్చినా నేను ముందుంటానని ఆకుల బాబు కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు. ఆయన వెంట వార్డ్ సభ్యులు, కార్యాకర్తలు ఉన్నారు.

## పింఛన్ల పంపిణీలో పాల్గొనండి : ఎమ్మెల్యే శ్రావణి

**నార్పల :** జులై 1వ తేదీ చేపట్టే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో టిడిపి శ్రేణులు సచివాలయం సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి పింఛను డబ్బులు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సూచించారు. ఎన్టీఆర్ భరోసా పింఛను రూ. 7వేలను ఇంటింటికీ అందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలని కోరారు.

# ఉసూరుమనిపిస్తున్న వానలు

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

జూన్ నెల ప్రారంభంలో ఎడతెరిపి లేని వర్షాలు పడ్డాయి. ఖరీఫ్ ప్రారంభంలోనే వానలు పడటంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. గతేడాది నెలకొన్న కరువు నుంచి ఈ ఏడాది అయినా బయటపడవచ్చునని భావించారు. ఈ వానలకు దుక్కులు దున్నుకుని పొలాలను సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో వర్షాధారంపై ఆధారపడి సాగు చేసుకునే పంటలకు జులై సరైన అదును. ఈ జులై 15లోపు వర్షాలొస్తే విత్తనం విత్తుకునేందుకు వీలుంటుంది. ఈ సమయంలో పంటసాగు చేస్తే మంచి పంట చేతికొస్తుందన్నది రైతు నమ్మకం. ప్రారంభంలో వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో ఈసారి తమ పంట పండుతుందని భావించారు. తీరా చూస్తే జూన్ మూడవ వారం నుంచి వానలు ఎత్తిపెట్టినట్టు కనిపిస్తున్నాయి. గత వారం రోజులుగా పెద్దగా వర్షాలు పడిన దాఖలాలు కనిపించడం లేదు. ఆశలు రేకెత్తించిన వరణుడు అదునులో మొఖం చాటేసినట్టు కనిపిస్తోంది. దీంతో రైతుల్లో మళ్లీ గుబులు రేగుతోంది. వానలు అసలైన సమయంలో ఏమి చేస్తాయోనని భయపడుతున్నారు. ఒకవైపు పంటకు అవసరమైన పెట్టుబడి సాయంగాని, పంటలబీమాగాని ఇప్పటి వరకు మంజూరు చేయలేదు. ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఇది ఏమవుతుందో కూడా తెలియక అయోమయ పరిస్థితుల్లోనున్నారు. డబ్బుల కోసం కూడా అనేక అవస్థలు పడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వం పెట్టుబడి సాయం, బీమా రెండూ ఇస్తే ఈసారి సాగుకు అవసరమైన ఖర్చులకు కష్టాలు తప్పుతాయని రైతులు భావిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి ప్రకటనా చేయలేదు. ఇకపోతే సాగునీటి కష్టాలు తప్పేలాలేవు. జిల్లాకు సాగునీటిని అందించే తుంగభద్ర, శ్రీశైలం రెండింటిలోనూ ఆశించిన నీరు రాలేదు. తుంగభద్ర డ్యామ్‌లో ఇప్పటికి నామ మాత్రంగానే నీరు చేరింది. డ్యామ్ పై భాగంలో పెద్దగా వర్షాలేవీ పడలేదు. జలవనరుల శాఖ అధికారులు మాత్రం వచ్చే నెల 20వ తేదీ నుంచి తుంగభద్ర డ్యామ్ నుంచి నీటిని విడుదల చేయించుకునేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాని మంచి వర్షాలు పడి డ్యామ్‌కు నీరొస్తేనే అది సాధ్యమవుతుంది. లేకపోతే తాగునీటికి కష్టాలు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొనే సూచనలు కనిపిస్తున్నాయి. ఎందుకంటే గతేడాది వర్షాభావంతో పెద్దగా నీరు రాలేదు. జిల్లాలోనున్న డ్యాముల్లో నీటి నిలువలు నామ మాత్రంగానే ఉన్నాయి. ఇకపోతే ఈ వారంలో రాజకీయంగా కొత్త ప్రభుత్వం కొలువుదీరి పనిని ప్రారంభించింది. వచ్చే నెల ఒకటవ తేదీన సామాజిక పింఛన్ల పంపిణీకి రంగం సిద్ధం చేసింది. ఇప్పటి వరకు ఉన్న మూడు వేల రూపాయల పింఛనును నాలుగు వేల రూపాయలకు పెంచడమే కాకుండా పాత నెలలకు కలిపి ఏడు వేల రూపాయలు ఇవ్వడానికి చర్యలు చేపట్టింది. వచ్చే వారంలో జరిగే ఈ కార్యక్రమానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో రాజకీయంగానూ తెలుగుదేశం నాయకులు తమ పార్టీ అధికారంలోకి వస్తూనే సంక్షేమాన్ని మరింత ముందుకు తీసుకెళుతోందని ప్రకటించుకునేందుకు ఉత్సాహపడుతున్నారు. మంగళవారం జరిగే పంపిణీలో పెద్దఎత్తున పాల్గొనాలని ఆ పార్టీ శ్రేణులను పిలుపునిచ్చి యున్నారు. అయితే మొదటి సంతకం చేసిన డీఎస్సీపై మాత్రం నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మెగా డీఎస్సీని మోసం చేసారంటూ నిరసనలు చేపడుతున్నారు. శనివారం నాడు అనంతపురం జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టడం గమనార్హం.

# నగర వనం అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాలవ

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణవాసులకు ఆహ్లాదం, ఆనందం పంచేలా నగరవనం ఉద్యానవనాన్ని తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఎమ్మెల్యే శనివారం పట్టణ ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, అటవీశాఖ అధికారులతో కలిసి పట్టణ పొలిమేరలోని నగర వనం ఉద్యానవనాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో నగరవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. తాము కొంత అభివృద్ధి చేశాక అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం నగరవనాన్ని విస్మరించిందన్నారు. అనంతరం ఆయన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి పార్కు ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాయదుర్గం పురపాలక సంఘం మాజీ అధ్యక్షులు ముదిగల్లు జ్యోతి, మాజీ ఉపాధ్యక్షులు వెంకటేశులు, కౌన్సిలర్లు జ్యోతి, ప్రశాంతి, నాయకులు హనుమంతు, సంపత్‌కుమారి, నాగమణి, భారతి, కృష్ణమూర్తి, నాగరాజు, ఇనాయత్‌బాషా, తిప్పేస్వామి, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీరు పోస్తున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

# రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

**ప్రజాశక్తి-అనంతపురం**

నగరంలోని సాయినగర్‌లో ఉన్న ఎ-1 ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఎ-1 చెస్ అకాడమీ ఆధ్వర్యంలో ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ సౌజన్యంతో శనివారం జిల్లా అండర్-19 ఓపెన్, బాలికల చెస్ ఛాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించారు. జిల్లా అండర్-19 ఓపెన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలో వెంకట శ్రీచైతన్‌రెడ్డి ఛాంపియన్‌గా నిలవగా కౌశిక్‌రెడ్డి, రెడ్డమ్మగారి హేమచరణ్‌రెడ్డి, కృష్ణ సుధీంద్ర వెంకట సముద్రాల వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచారు. జిల్లా అండర్-19 బాలికల చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలో అస్మిత అనిమి ఛాంపియన్‌గా నిలవగా, యశస్విని అనిమి, జి.శ్రీహా, కటారి భువనకృతి వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచారు. ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ కార్యదర్శి, ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్ కుమార్‌నాయుడు, ఛైర్మన్ బాలరాజు, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ మల్లికార్జున, నేషనల్ ఆర్బిటర్లు మెహరాజ్, కాశీ రవీంద్ర, చెస్ కోచ్ కిషోర్, టోర్నీ కోఆర్డినేటర్ గోవిందరాజు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. విజేతలు నంద్యాలలో జులై 18, 19 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-19 ఓపెన్, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని ఉదయ్ కుమార్ నాయుడు గారు తెలిపారు.

# సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన

**ప్రజాశక్తి-బొమ్మనహాల్**

మండలంలోని గోవిందవాడ గ్రామంలో శనివారం వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. వైద్య సిబ్బంది, సర్పంచి, పంచాయతీ కార్యదర్శి గ్రామంలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్‌తో శుభ్రం చేసి తాగునీటిలో ఫ్లోరైడ్ కలిపారు. అలాగే గ్రామ వీధిలో సమావేశం నిర్వహించి డెంగీ, మలేరియా, డయేరియా, తదితర వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు నీరు కాచి చల్లార్చి తాగాలని, దోమల నివారణకు ఇంటి వద్ద వేపాకు పొగ వేసుకోవాలని, దోమతెరలు వాడాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, వీధుల్లో మురికినీరు నిల్వ వుండరాదని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకేష్, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్‌లో 166 కేసులు పరిష్కారం

**ప్రజాశక్తి-రాయదుర్గం**

పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలతో 166 కేసులు పరిష్కారం అయ్యాయి. హిందూపురం సీనియర్ సివిల్ జడ్జి, రాయదుర్గం మండల న్యాయ సేవ అధికార సంస్థ ఇన్‌ఛార్జి ఛైర్మన్ ఎం.శ్రీధర్ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు పరిధిలో 27 కేసులకు గానూ రూ. 55,180 జరిమానా విధించారు. రూ. 2.25 లక్షల విలువైన కేసులు పరిష్కరించబడ్డాయి. కాగా సెకండ్ క్లాస్ కోర్టు పరిధిలో 139 పెట్టి కేసులకు గానూ రూ. 64,800 జరిమానా విధించారు. ఈ కేసులకు సంబంధించి రూ. 3,97,492 సొమ్మును సీజ్ చేశారు.

లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జిలు

విద్యార్థిని జ్యోతితో హెచ్‌ఎం సర్వమంగళ, ఉపాధ్యాయులు

## ఆర్డీటీ హాకీ అకాడమీకి పాల్తూరు విద్యార్థిని ఎంపిక

**ప్రజాశక్తి-వజ్రకరూరు**

విడపనకల్లు మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన బి.జ్యోతి ఆర్డీటీ హాకీ అకాడమీకి ఎంపికైనట్లు ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం సర్వమంగళ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.జ్యోతిని శనివారం పాఠశాల సిబ్బంది అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఆర్డీటీ ఆధ్వర్యంలో వేసవిలో నిర్వహించిన శిక్షణ శిబిరంలో జ్యోతి అత్యంత ప్రతిభ కనబరిచి హాకీ అకాడమీకి ఎంపిక కావడం అభినందించదగ్గ విషయం అన్నారు. జ్యోతికి అకాడమీలో హాకీలో శిక్షణతో పాటు చదివిస్తారన్నారు. భవిష్యత్తులో హాకీ జాతీయ జట్టులో స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, రమేష్, శ్రీనివాసరాజు, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

**మహారాజ శ్రీ కర్నూలు 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో**

**O.S.No.997/2022**

కె.వెంకట సుబ్బారెడ్డి. ...వాది

-Vs-

టి.దుర్గాబాయి వగైరా. ...ప్రతివాదులు

**1,2 ప్రతివాదులకు దావా సమన్లు**

1.టి.దుర్గాబాయి భర్త టి.శ్రీనివాసరావు,
2.టి.శ్రీనివాసరావు తండ్రి వెంకటరమణరావు,
ఇంటి నెం.86/352, డాక్టర్స్ కాలని, కర్నూలు.
ప్రస్తుతం ఇంటి నెం.17, MIES విల్లాస్, సర్వే నెం.156/1, రుద్రంపేట పంచాయితి, సాక్షి ఆఫీస్ ఎదురుగా, ఎన్.హెచ్-44,
అనంతపురము పిన్-515004.

పై నెంబర్ దావాలో వాది ప్రతివాదుల నుండి దావా మొత్తం రూ॥10,39,530-00 రూపాయలు ఇందుపైన 36% ప్రకారం ముందువడ్డి, కోర్టు ఖర్చులు రాగోరి దావా దాఖలు చేసినాడు. ఇందులో 1,2 ప్రతివాదులు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 07/08/2024 తేది పగలు 10.30 గం॥కు పై కోర్టులో హాజరు అయి తెలుపుకొనవలయును. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

**(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)**

**ఇస్కాల శ్రీనివాసులు,**
వాదిపరం అడ్వకేటు, కర్నూలు.
సెల్ : 9866409704

**ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024**

# ఎంట్రీలకు ఆహ్వానం

*ప్రియమైన మిత్రులారా!*

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

**ఎంట్రీలు పంపాల్సిన చిరునామా**

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ